


మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన బీజేవైఎం నేత పృథ్వీ, బీజేపీ నేతలు

# బీఆర్‌ఎస్‌లో చేరిన బీజేవైఎం నేతలు

*మంత్రి కేటీఆర్ సమక్షంలో చేరికలు*

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 22 : కూకట్‌పల్లిలో బీజేపీ నుంచి బీఆర్‌ఎస్‌లోకి చేరికల జోరు కొనసాగుతున్నది. నియోజకవర్గం సీటును బీజేపీకి కాకుండా జనసేనకు కేటాయించడంతో నిరసన వ్యక్తం చేస్తూ.. మేడ్చల్ జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షుడు పృథ్వీ బీజేపీకి రాజీనామా చేశాడు. బుధవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కో ఆర్డినేటర్ సతీశ్ ఆధ్వర్యంలో మంత్రి కేటీఆర్ సమక్షంలో పృథ్వీతో పాటు పలువురు బీజేపీ, బీజేవైఎం నేతలు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా పృథ్వీ మాట్లాడుతూ.. కష్టపడి పనిచేసిన తమకు గుర్తింపు లేకపోవడంతో ఆ పార్టీని వీడి.. స్థానికంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ పనిచేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి మాధవరం కృష్ణారావుకు మద్దతుగా పార్టీలో చేరినట్లు తెలిపారు. కూకట్‌పల్లిలో బీఆర్‌ఎస్ పార్టీ గెలుపు కోసం పని చేస్తామని పేర్కొన్నారు.

# అన్ని వర్గాల సంక్షేమానికి కృషి

*మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్*



ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ , చిత్రంలో హాజరైన ఉపాధ్యాయులు

అమీర్‌పేట్, నవంబర్ 22: కార్పొరేట్ విద్యా సంస్థల పోటీని తట్టుకుని, తమకు ఉన్న వనరులతో విద్యార్థులకు చక్కటి విద్యను అందిస్తున్న ప్రైవేట్ యాజమాన్యాలకు తాను అండగా ఉంటానని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. నియోజకవర్గంలో అన్ని వర్గాల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. బుధవారం బల్కంపేటలోని ఏకేగౌడ్ ఫంక్షన్ హాలులో ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనానికి సనత్‌నగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి తలసాని శ్రీనివాస్‌యాదవ్ హాజరై మాట్లాడారు. కరోనా విపత్కర సమయంలో చిన్న ప్రైవేట్ పాఠశాలలు ఎదుర్కొన్న కష్టాలను పరిష్కరించామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. విద్యార్థుల భవితకు బంగారు బాటలు వేస్తున్న ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు, అక్కడ పని చేస్తున్న ఉపాధ్యాయులకు ఎటువంటి ఇబ్బందులున్నా బీఆర్‌ఎస్ ప్రభుత్వం సామరస్యపూర్వకంగా పరిశీలించి పరిష్కరిస్తుందన్నారు. ఈ ఎన్నికల్లో ఉపాధ్యాయులు, యాజమాన్యాలు బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి మద్దతు తెలుపాలని కోరారు. ప్రభుత్వం ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలను అర్హులైన ఉపాధ్యాయులకు అందే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మిరెడ్డి, అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్‌రావు, సుధాకర్, ప్రశాంత్, వెంకట పవన్, ప్రసాద్, అల్తాఫ్ హుస్సేన్, పవన్, సోమసుందర్ పాల్గొన్నారు.

# మహిళల మద్దతు బీఆర్‌ఎస్‌కే

బంజారాహిల్స్, నవంబర్ 22: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలతో ఎక్కువగా లబ్ధి పొందుతున్న మహిళల మద్దతు బీఆర్‌ఎస్ పార్టీకే ఉన్నదని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి దానం నాగేందర్‌తో కలిసి బుధవారం బంజారాహిల్స్ రోడ్ నం.12లోని ఎన్‌బీటీనగర్, రేషమ్‌బాగ్, ఎన్‌బీటీనగర్ కుంట, కర్నాటక గల్లీ ప్రాంతాల్లో మేయర్ విజయలక్ష్మి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించాలని ప్రజలంతా నిర్ణయించుకున్నారన్నారు. ముఖ్యంగా మహిళలు బీఆర్‌ఎస్ పార్టీపట్ల సంపూర్ణ విశ్వాసంతో ఉన్నారని తెలిపారు. బంజారాహిల్స్ డివిజన్‌లో చాలా మందికి ఇటీవల డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు వచ్చాయని, ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత మరింత మందికి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇస్తామన్నారు. మరోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.400కే గ్యాస్ సిలిండర్, సౌభాగ్యలక్ష్మి కింద నెలకు రూ.3వేలు, రూ.5లక్షల ఆరోగ్యబీమా లాంటి అనేక పథకాలు అమలు చేయనున్నామని ఖైరతాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ తెలిపారు.



బంజారాహిల్స్‌లో కారు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థిస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి దానం నాగేందర్, మేయర్ విజయలక్ష్మి



బీఆర్‌ఎస్‌లో చేరిన పలువురికి పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న కంటోన్మెంట్ అభ్యర్థి లాస్యనందిత

# అభివృద్ధికి ఆకర్షితులై చేరికలు

కంటోన్మెంట్, నవంబర్ 22: కంటోన్మెంట్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందితకు మద్దతుగా ఇతర పార్టీల నుంచి గులాబీ పార్టీలోకి చేరికలు కొనసాగుతున్నాయి. బుధవారం కంటోన్మెంట్ ఐదో వార్డుకు చెందిన బీజేపీ నేతలు, కార్యకర్తలు కార్ఖానాలోని క్యాంపు కార్యాలయంలో లాస్యనందిత సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. లాస్యనందిత వెన్నంటి ఉంటామని ప్రతినబూనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీతో కంటోన్మెంట్ ప్రజలకు ఒరిగేమీ లేదని, గులాబీజెండాతోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని నేతలు స్పష్టం చేశారు. మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు ఆడబిడ్డకు అండగా ఉంటామని, లాస్యనందితను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. ఈ సందర్భంగా లాస్యనందిత వాళ్లందరికీ గులాబీ కండువా కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సతీశ్ గుప్తా, ఐదోవార్డు ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు సోమప్ప ముదిరాజ్, సాయి సతీశ్, మల్లికార్జున్, బీమేశ్, అరుణ్, రవికుమార్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



రహ్మత్‌నగర్ డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మాగంటి

# బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయం

వెంగళరావునగర్, నవంబర్ 22: ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయమని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం రహ్మత్ నగర్ డివిజన్‌లోని ఆశయనగర్, బీజేఆర్ నగర్, ఓం నగర్, వినాయక నగర్, నవీన్ నగర్ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మాట్లాడుతూ...ముఖ్యమంత్రి కేసీఆర్‌కు హ్యాట్రిక్ విజయాన్ని అందించేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారని అన్నారు. హైదరాబాద్‌లో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయని, రోజుకు 250 సినిమాల షూటింగులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. దేశంలోని అనేక ప్రాంతాల నుంచి వచ్చిన వారు హైదరాబాద్ నగరంలో స్థిరపడుతున్నారని చెప్పారు. రాష్ట్రం అభివృద్ధిలో అగ్రగామిగా దూసుకుపోతూ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. కారు గుర్తుకు ఓటేసి..తనను మరోమారు గెలిపించాలని ఆయన ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు నజీర్, బషీర్, నర్సింహారెడ్డి, రాకేశ్, అరుణ్,చోటు, సిద్ధూ, సురేందర్, ఆనందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిపక్షాల మాటలు విని ఆగం కావొద్దు..

*ప్రచారంలో ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యే వివేకానంద్*

దుండిగల్, నవంబర్ 22: ప్రతిపక్షాల మాటలు విని కుత్బుల్లాపూర్ ప్రజలు ఆగం కావొద్దని ఎమ్మెల్సీ, నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే అభ్యర్థి కేపీ.వివేకానంద్ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి బౌరంపేట్‌లోని త్రిపుర విల్లాస్, ఇందిరమ్మ కాలనీ, సింహపురి కాలనీ, బౌరంపేట్ గ్రామాలతో పాటు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సప్తపది గార్డెన్స్‌లో నిర్వహించిన 'కమ్మ సంఘం ఆత్మీయ సమ్మేళనం'లో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల సహకారంతో నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశామన్నారు. ఒక్క ఛాన్స్ పేరుతో ఓట్లడుగుతున్న నేతలు 11సార్లు అవకాశమిస్తే రాష్ట్రానికి ఏం ఒరగబెట్టారో ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో ఉన్న వాళ్లంతా తెలంగాణ బిడ్డలేనని స్పష్టం చేశారు. కులాలు, మతాలు, ప్రాంతాల వారీగా మనల్ని విడదీసేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ఓట్ల సమయంలోనే ప్రజల్లోకి వచ్చే ప్రతిపక్ష నాయకుల మాటలు నమ్మొద్దని సూచించారు. కాగా దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని దుండిగల్, గాగిళ్లాపూర్, చర్చిగాగిళ్లాపూర్, నాగులూరు, దుండిగల్ తండా-1,2లో ఎమ్మెల్యే వివేకానంద్ ప్రచారం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు బోనాలతో వచ్చి ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు.



ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్ చిత్రంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు